క్లుప్తంగా

జవాన్ల కోసం ప్రార్థనలు చేయండి



దొర్నిపాడులో మాట్లాడుతున్న అబ్దుల్ గఫార్

దొర్నిపాడు: చలి, ఎండ, వానల్లో జవాన్లు మన కోసం శ్రమిస్తున్నారని, వారి క్షేమం కోసం ప్రతి ఒక్కరూ వారిని గుర్తుచేసుకొని ప్రార్థనలు, పూజలు చేయాలని సామాజిక ప్రసంగీకుడు మద్రిపల్లె అబ్దుల్ గఫార్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన ఆటో యాత్ర నిర్వహించి జవాన్ల సేవలు, వారి గొప్పతనం గురించి వివరించారు. మనం ఇళ్ల వద్ద ఎలాంటి భయం లేకుండా జీవిస్తున్నామంటే జవాన్ల త్యాగఫలమేనని పేర్కొన్నారు.

ఆటోలో నుంచి జారిపడి వృద్ధురాలికి తీవ్రగాయాలు



గాయపడిన వృద్ధురాలు ఎంగమ్మ

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామ సమీపంలో ఆటోలో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఎంగమ్మ అనే వృద్ధురాలికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. రుద్రవరం మండలం ఆలమూరు, లింగందిన్నె గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు మండలంలోని మాయలూరు గ్రామ సమీపంలో ఓ రైతు పొలంలో కూలీ పనుల నిమిత్తం వచ్చారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్లే సమయంలో ఆటో అతి వేగంగా మలుపు వద్ద తిప్పడంతో వృద్ధురాలు జారి కింద పడింది. ఉయ్యాలవాడలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న రోగులు

నంద్యాల(వ్యవసాయం): గాంధీచౌక్‌లోని నెరవాటి హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, నంద్యాల ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ చంద్రశేఖర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నిర్వాహకులు డాక్టర్ వినోద్‌కుమార్, అరుణకుమార్ మాట్లాడుతూ శిబిరంలో వంద మందికి పైగా సంతానం లేని దంపతులకు ఉచిత చికిత్స అందించి రూ.2లక్షలు విలువైన మందులు ఉచితంగా అందజేశామని చెప్పారు. నెరవాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం కృషితో ఎదగాలి



మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మహిళలు స్వయం కృషితో ఎదగాలని కర్నూలు జిల్లా పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం స్థానిక సంజీవనగర్‌లోని భద్రావతి భావనారుషి కల్యాణ మండపంలో పద్మశాలీయ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని సమాజంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అంతరం సంఘం ఆధ్వర్యంలో 50 మందికి కుట్టుమిషన్లు అందజేశారు. సంఘం నాయకులు శంకర్, వద్దినరసింహులు, సాగు సూర్యనారాయణ, శ్రీకాంత్, బ్రహ్మయ్య, చింతలపల్లె వాసు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



ఇంజేడులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు

ఉయ్యాలవాడ : రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందని, మార్కెట్‌లో వాటికి మంచి ధర లభిస్తుందని, రైతులు సాగు చేసి లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ఇంజేడు, హరివరం, మాయలూరు రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలను ఈ- క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ నెల 28వ తేదీలోపు ఈ-కేవైసీ తప్పనిసరిగా ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, ఏఈఓ వెంకటేశ్వరరెడ్డి, రాణెమ్మ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు మహర్దశ





పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం





ఉయ్యాలవాడ 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నూతనంగా నిర్మితమవుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- రూ.2.40 కోట్లతో ఆధునికీకరణ
- రూపుదిద్దుకోనున్న మయలూరు, పెద్దయమ్మనూరు ఆరోగ్య కేంద్రాలు
- ఉయ్యాలవాడ 24 గంటల ఆసుప్రతికి నూతన భవనాలు
- కార్పొరేట్‌కు దీటుగా వసతులు





మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఉయ్యాలవాడ : పేదల వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యంగా గ్రామాల్లోని పీహెచ్‌సీల ఆధునికీకరణకు చర్యలు చేపట్టింది. నాడు-నేడు అభివృద్ధి పనుల్లో భాగంగా రూ. 2.40 కోట్లు మంజూరు చేయడంతో పనులు సగానికి పైగా పూర్తయ్యాయి. మాయలూరు, పెద్దయమ్మనూరు ఆరోగ్య కేంద్రాల మరమ్మతులకు ఒక్కో దానికి రూ. 30 లక్షలతో ప్రహరీ, రోగులు, సిబ్బందికి కావలసిన మౌలిక సదుపాయాలు, భవనాల ఆధునికీకరణ పనులు 90 శాతం పూర్తి కావడంతో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులను తలపిస్తున్నాయి. మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో ప్రస్తుతం కొనసాగుతున్న 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 1960లో నిర్మించడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీని స్థానంలో ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేయడంతో ఆరోగ్య కేంద్రం ఆవరణలోనే రోగులకు సిబ్బందికి కావలసిన వసతులతో నూతన భవన సముదాయం నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు

పెద్దయమ్మనూరు, మాయలూరు పీహెచ్‌సీల మరమ్మతులు 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఉయ్యాలవాడలో నూతనంగా చేపట్టిన 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన సముదాయం పనులు 70 శాతం పూర్తయ్యాయి. నాణ్యతగా నిర్మించేలా, మార్చి ఆఖరుకు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం. – హుసేని, ఆర్అండ్‌బి ఇన్‌చార్జ్ జేఈ, బనగానపల్లె

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): మార్చి 2వ తేదీన విజయవాడలో జరిగే పోరుబాట కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి సోమన్న కోరారు. ఆదివారం సీపీఐ నాయకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు స్వాధీనం చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80లక్షలతో నిర్మాణాలు పూర్తి కావడం కష్టతరంగా మారిందని, ఒక్కో గృహ నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. శ్రీనివాసులు, బాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగునీటిపై ఆందోళన చెందొద్దు



బత్తలూరు సమీపంలో కేసీ కెనాల్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

శిరివెళ్ల: సాగునీటిపై కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. వరి పంట సాగు చేసిన రైతుల వినతి మేరకు ఆదివారం కేసీ కెనాల్ 16వ లాక్ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాల్వలో 3 అడుగుల మేర నీరు ప్రవహిస్తుందన్నారు. అది చూసి రైతులు ఆందోళన చెందవద్దన్నారు. గేజ్ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడానని, మూడు రోజుల్లో కాల్వలో 5 అడుగుల మేర నీటి ప్రవాహం ఉండేలా చూస్తామని చెప్పారని, మార్చి నెలాఖరు దాకా నీరు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, రైతు సంఘం నాయకులు ఇందూరి ప్రతాపరెడ్డి, మేర్వ సాంబిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: రబీలో సాగుచేసిన చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని శిరివెళ్ల, బత్తలూరు సమీపంలో కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహాన్ని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సాగునీరు రాదనే పుకార్లను నమ్మొద్దన్నారు. రబీ పంటలు చేతికి వచ్చేవరకు సాగునీరిచ్చేలా అధికారులతో మాట్లాడామని చెప్పారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

ఆళ్లగడ్డ: ఆధార్ వినియోగంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అందరూ అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2016 కంటే ముందుగా ఆధార్ తీసుకున్నవారు వెంటనే తగిన ధ్రువపత్రాలు చూపి మార్చుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 27, 28 తేదీల్లో అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో ఆధార్ మేళా ఏర్పాటు చేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పూజల అనంతరం కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం



దివ్యాంగులకు వీల్‌చైర్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయమని లయన్స్ గవర్నర్ రామచంద్రప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం లయన్స్ జిల్లా పర్యటన సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక స్నేహ వృద్ధాశ్రమానికి లయన్స్ యువజన విభాగం 150 కేజీల కందిబేడలు అందజేసిన అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. నంద్యాల శివారులో లయన్స్‌క్లబ్ స్వాగత బోర్డును ఆవిష్కరించారు. క్రాంతినగర్‌లోని జీవన జ్యోతి అంధుల వసతి గృహానికి ఆహార సరుకులను అందజేశారు. సంఘమిత్ర బాలురకు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి సౌజన్యంతో నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. మహానంది రోడ్డులోని బాలికల ఛాత్రాలయంలో కాస్మోటిక్ కిట్లుఅందజేశారు. నంద్యాల వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద దివ్యాంగులకు హెల్త్‌కార్డులు, నెలవారి మందులు, చంక కర్రలను పంపిణీ చేశారు. బాలాజీ కల్యాణ మండపంలో క్లబ్ సభ్యుల విరాళాలతో 19 కుట్టు మిషన్లు, 13 వినికిడి మిషన్లు, 9 చక్రాల కుర్చీలు దివ్యాంగులకు అందజేశారు. అలాగే జిల్లా జీత్‌కునేడో కరాటే సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్, కూరప్రసాద్, రత్నకుమార్, రమణయ్య, చంద్రశేఖర్, భవనాశి నాగమహేష్, భద్రిశెట్టి శ్రీకాంత్, డాక్టర్ వినోద్, పవన్ పాల్గొన్నారు.

దూదేకుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): దూదేకుల సంఘం పట్టణ అధ్యక్షుడిగా వాసవి దస్తగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక వాసవీ స్కూల్‌లో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని మాజీ అధ్యక్షుడు కాశీం, కార్యదర్శి దస్తగిరి, హుసేన్‌బాషా ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్, డాక్టర్ చమన్, మహమ్మద్, దస్తగిరి హాజరయ్యారు. ఉపాధ్యక్షులుగా సీడ్స్ బాబు, కన్నయ్య, జైనాబీ, బాషా, శంషావలి, ప్రధాన కార్యదర్శిగా ఆదాం సాహెబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా హుసేనప్ప, కోశాధికారిగా సోమశేఖర్‌తో పాటు 9మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులను సంఘం నాయకులు సన్మానించారు.

పచ్చ మీడియా రాతలను ప్రజలు నమ్మరు



ఈనాడు ప్రతులను దహనం చేసి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు కథనాలు రాస్తున్న ఈనాడు పత్రిక రాతలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పు జగన్‌ప్రసాద్, మాజీ కౌన్సిలర్ అనిల్ అమృతరాజ్ అన్నారు. ఎల్లో మీడియాలో వస్తున్న పిచ్చిరాతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం స్థానిక శ్యాంనగర్ సెంటర్, వైఎస్సార్ విగ్రహం ఎదుట ఈనాడు పత్రికా ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఈనాడు పత్రికలో ప్రభుత్వంపై విషం చిమ్ముతూ వార్తలు రాయడం తగదన్నారు. తప్పుడు రాతలు, చంద్రబాబు పిచ్చికూతలు మానుకోకపోతే తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. చంద్రబాబు చేతిలో రామోజీరావు కీలుబొమ్మగా మారి పిచ్చిరాతలు రాస్తూ జర్నలిజం విలువలను దిగజారుస్తున్నామని మండిపడ్డారు. కార్యక్రమంలో లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, ఎద్దు రవి, కారు రవి పాల్గొన్నారు.



శివాలయంలో నూతనంగా నిర్మించిన గోపురం



రామాలయ ఆవరణలో హోమం చేస్తున్న దృశ్యం

వేడుకగా ప్రతిష్ఠోత్సవాలు

రుద్రవరం: మండలంలోని డీ.కొట్టాలలో వివిధ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గ్రామంలో ఇది వరకే రామాలయం, శివాలయం నిర్మించారు. అయితే ఆయా ఆలయాల్లో గోపురం, దేవతా మూర్తుల విగ్రహాలు దెబ్బతిన్నాయి. వాటిని మార్చాలని గ్రామస్తులు భావించారు. ఇందులో భాగంగా శివాలయం గోపురాన్ని నూతనంగా నిర్మించడంతో పాటు రామాలయంలో ప్రతిష్ఠించేందుకు విగ్రహాలు తీసుకొచ్చారు. వాటితో పాటు గ్రామ శివారులో నూతనంగా గంగమ్మ ఆలయం నిర్మించి ప్రతిష్ఠోత్సవ వేడుకలను శనివారం ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రామాలయం వద్ద గ్రామస్తుల సమక్షంలో పండితులు హోమాలను సంప్రదాయబద్ధంగా జరిపించారు.

విభిన్నమైన ప్రేమ కథా చిత్రం 'ఏది ప్రేమ'



మాట్లాడుతున్న నిర్మాత రమేష్ తోడేటి

నంద్యాల(అర్బన్): ప్రేమకథలకు భిన్నంగా 'ఏది ప్రేమ' అనే చిత్రాన్ని స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రంగా తీస్తున్నట్లు నిర్మాత రమేష్ తోడేటి తెలిపారు. ఏది ప్రేమ చిత్రం ప్రారంభంపై పట్టణంలో టీఆర్ ప్రొడక్షన్స్ నిర్వాహకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. నిర్మాత మాట్లాడుతూ టీఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఏదిప్రేమ అనే సినిమా తీసి నిర్మాతల వరుసలో మన ప్రాంత వాసిగా నిలవాలనేది తన కోరిక అన్నారు. నూతన నటీ, నటులతో నంద్యాల ప్రాంత అందాలను ప్రేక్షకులకు చూపించాలనే కోరికతోనే మార్చి 25న సినిమా చిత్రీకరణ ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలోని పచ్చటి పొలాలు, అందమైన కొండలు, నల్లమల అడవి అందాలు, పవిత్ర పుణ్యక్షేత్రాల వద్ద, పురాతన కట్టడాల పరిసరాల్లో చిత్రీకరణ పూర్తిచేస్తామన్నారు. తక్కువ బడ్జెట్‌తో తెలుగు, కన్నడ, తమిళ్ భాషల్లో సినిమాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ముత్తుకుమార్, మ్యూజిక్ డైరెక్టర్ ఆల్‌డ్రీన్, కెమెరామెన్ లక్ష్మీనారాయణ, హీరోయిన్ విద్యాకృష్ణ, హీరోలు తోక కార్తీక్, అమన్, రామదుర్గా, నాగపుల్లయ్య, కిశోర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వెలుగోడు: వేల్పనూరు గ్రామంలోని అంకాల పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ నుంచి మూడు రోజుల పాటు దేవస్థానంలో అంగరంగ వైభవంగా నాగ ప్రతిష్ఠోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం వార్షికోత్సవ పూజలు, హోమాలు చేపట్టారు. శిఖర కుంభాభిషేకం అలాగే అశ్వత్థ నారాయణ కల్యాణం (రావి చెట్టు వేప చెట్టు కళ్యాణం) నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు, నూతన విగ్రహాలను ఊరేగించారు. ఈ నెల 27 సోమవారం ఉదయం 7:30 నుంచి యంత్ర స్థాపన నాగ ప్రతిష్ఠ పూర్ణాహుతి, విశేషంగా రాముల వారి కల్యాణం నిర్వహిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు బుడ్డా శేషారెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



108 హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: స్థానిక జమ్మలమడుగు చౌరస్తాలోని వెంకటరమణ కాలనీలో అష్టలక్ష్మి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాలు, జపాదులు, వేదపఠనం, యంత్రాలకు అభిషేకం, మహా మంగళహారతి, అరుణ, దత్త, సుబ్రహ్మణ్య హోమాలు జరిగాయి. సాయంత్రం ప్రదోషపూజ, జలాధివాసం, తీర్థప్రసాదవినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు మైలవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామాయణ ప్రవచన సుధాకర కార్యక్రమం భక్తులను అలరించింది.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

మహానంది: పాతకక్షల నేపథ్యంలో ఈనెల 13న ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న చెవుల శ్రీనివాసులు(45) కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు మహానంది ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన చెవుల శ్రీనివాసులు, ఫక్కీరమ్మల మధ్య ఈ నెల 13న రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఫక్కీరమ్మను తిడుతున్నాడన్న కారణంతో ఇరువురి మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఫక్కీరమ్మ బంధువులైన బోయిలకుంట్ల, తమ్మడపల్లె గ్రామాలకు చెందిన మణిమహేష్, నరసింహుడు, శివరాముడు, మరికొందరు చెవుల శ్రీనివాసులుపై కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేసి గాయపరిచారు. తలకు తీవ్రంగా గాయమైన ఆయనను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. శ్రీనివాసులు ఇదివరకే ఫిర్యాదు చేసిన మేరకు నమోదైన హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్పు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

నేడు వాహనాల వేలం

కోవెలకుంట్ల: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సోమవారం వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాటుసారా, అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు రూ. 3వేలు డిపాజిట్ చెల్లించి ఆధార్, పాన్‌కార్డులతో వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

షటిల్ పోటీల్లో ఆళ్లగడ్డ క్రీడాకారుల ప్రతిభ

ఆళ్లగడ్డ: ఈనెల 18, 19 తేదీల్లో ఆత్మకూరులో జరిగిన జిల్లా షటిల్ టోర్నమెంట్‌లో ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపి మొదటి రెండు బహుమతులు సాధించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 80 జట్లు పాల్గొనగా సద్దాం, రమణ మొదటి బహుమతి, రాజు, హరి రెండో బహుమతి కైవసం చేసుకున్నారు. ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో స్టేడియం మేనేజర్ సురేష్, హుసేన్‌బాషా, జగన్నాథ్‌రెడ్డి తదితరులు క్రీడాకారులను సన్మానించారు.

లోకేష్ మాటలను ప్రజలు విశ్వసించరు



మాట్లాడుతున్న రాజునాయక్

నంద్యాల(అర్బన్): అధికారం కోసం యాత్ర పేరుతో విన్యాసాలు చేస్తున్న పిట్టలదొర లోకేష్ మాటలు నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని, ఆయన పాదయాత్రల వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయే తప్ప ఎలాంటి ఉపయోగం లేదని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ విమర్శించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రలో జనాలు కనపడక స్థానిక నేతలపై చంద్రబాబు ఆగ్రహంవ్యక్తం చేయాల్సి దుస్థితి తలెత్తిందన్నారు. సభల్లో లోకేష్ ప్రసంగం ప్రజలను ఆకట్టుకోలేకపోతుందని, చివరకు యాత్ర ఎందుకు చేస్తున్నామో కూడా ఆ పార్టీ నాయకులకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, నారా లోకేష్ ప్రజలను బానిసలుగా మార్చాలనే దురద్దేశంతో వారి హయాంలో ప్రజలను నిర్లక్ష్యం చేశారన్నారు. రాజధాని మార్పు జరిగితే దందా వ్యాపారం బయట పడుతుందనే ఉద్దేశంతో రాజధాని అమరావతిలోనే ఉండాలని చెబుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గిరిజనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రాధాన్యతను కల్పిస్తున్నారని కొనియాడారు. జీపీఎస్ నాయకులు బాలునాయక్, రవినాయక్, మల్లేష్‌నాయక్, విక్రమ్‌నాయక్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



ప్రధాన కార్యదర్శి డా.కెఎస్ జవహర్‌రెడ్డికి స్వామివార్ల జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్ లవన్న, అర్చక వేదపండితులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా, చైర్మన్, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

మహానందిలో భక్తుల సందడి



దర్శనార్థం వస్తున్న భక్తులు

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం నిర్విరామంగా కొనసాగింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు స్వామి, అమ్మవారి దర్శనం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.